

# అతడు

మనిషి శరీరం ఒక బయో వాచ్. ఇరవై నాలుగు గంటల సమయానికి సెట్ చేయబడి.. ట్యూన్ చేయబడి.. అసంకల్పిత నియంత్రణతో దానంతటదే నడిచే ఒక జీవవ్యవస్థ. ఈ రోజు ఈ క్షణం ఏమి చేస్తావో.. రేపు మళ్ళీ అదే సమయానికి అదే పనిని చేయాలనే అదృశ్య కుతూహలం.. అదే సమయానికి నిద్ర.. అదే సమయానికి ఆకలి.. అదే సమయానికి సెక్స్.. అదే సమయానికి తాగుడు కుతి.. అదే సమయానికి అదే .. ఏదైనా.

అతడు.. రాజు.. ఇరవై రెండేళ్ళ రాజు ఎస్సెస్సీ నాల్గుసార్లు తప్పి, గవర్నమెంట్ టీచర్ ఐన అమ్మ నెత్తీ నోరూ బాదుకుని బలవంతంగా బతిలాడీ బతిలాడీ.. పంపితే.. ఇంటర్ ఎం.పి.సి.లో చేరి.. ఉహూ.. చదువు అబ్బని రాజు.. తర్వాత.. ఆవారా.. బొగ్గుబావుల సింగరేణి బెల్ట్ లోకంలో.. బెల్లంపల్లి.. మందమర్రి.. రామగుండం.. గోదావరి ఖని.. కళ్ళు విశాలమై.. చూపులు విస్తృతమై.. ఆకలి ఆవులిస్తూ.. వయసు విచ్చుకుంటూ.. శరీరం ఒట్టి తినడానికీ తాగడానికే కాదు.. ఇంకేవేవో పనులకు కూడా అని తెలుసుకుంటూ.. నరాల్లో ఒక్క రక్తమే కాదు.. కొంత అగ్నికూడా ఉంటుందని.. దేహం దేహమంతా ఒక నిప్పులకొలిమిలా దహించుకుపోతూ లోలోపల దాహంతో రగిలిపోతూంటుందని.. తెలుసుకుంటూ.. అప్పుడప్పుడు తెలియని 'దేని' కోసమో వెదుక్కుంటూ వెదుక్కుంటూ.. జవాబు

దొరక్క.. మెల్లమెల్లగా.. సారా.. విస్కీ.. బ్రాందీ.. ఏదిబడితే అది తాగి.. బానిసగా మారుతున్న రాజు,

ఎనిమిది గంటలు.. రాత్రి.. పొద్దుటినుండి ఒకటే వర్షం. ఎడతెగని వర్షం.. ముసురు కొద్దిసేపు.. మళ్ళీ చినుకులు ముదిరి జోరు వాన మరికొంతసేపు.

పైన రేకుల షెడ్‌పై పడ్తున్న చినుకుల చప్పుడు.. ఒక రిథం.. లయ..

ఎనిమిది కాగానే రాజు దేహమంతా దాహం దాహం.. బయో వాచ్ అరుస్తోంది.. అలారం మోగిస్తోంది.. మందు కావాలి.. ఎక్కడిదో అక్కడిది.. ఎవరో ఒకరితో.. ఏ రకంగానైనా సరే.. ఎలాగైనా సరే .. కొంత మందు కావాలి.. ఎలా.. ఎలా?

సరిగ్గా ఆ క్షణం మోగిందతని సెల్ ఫోన్.

"అరే రాజూ! రెడీయేనా? రానా నేను నీదగ్గరకు.. అక్కడే ఆ గూడ్స్ రేకుల షెడ్ దగ్గరే ఉన్నావు గదా!" రఫీక్ గాడు.

ప్రాణం లేచొచ్చింది రాజుకు. రఫీక్‌గాడైతే వెంటనే తప్పక మందు తీసుకుని వస్తాడు క్షణాల్లో. తెలుసు వాడికి తనకేమి కావాలో? చిన్ననాటి క్లాస్‌మేట్ వాడు. మొన్నటిదాకా నూకుడు బండిపై ఉల్లిగడ్డలమ్మే వాడు. గత నాల్గు నెలలుగా తనతోనే ఇదే పని.. బొగ్గు దొంగతనం. రఫీక్ అంటే మెరుపు తీగ.. రఫీక్ అంటే స్పైడర్ మ్యాన్ కంటే చురుకు.. గెంతు గెంతితే రైలు డబ్బాలను దాటుకుంటూ సినిమాల్లో కంటే వేగంగా.. ఒకటే పరుగు.. ఒకటే ఉరుకు.. కన్ను తెరిచి మూసేలోగా మటుమాయం.

"తొందరగా వచ్చేయ్ రా.. చాలా చలిగా ఉండి.. వెచ్చగా మందు కావాలి ప్లీజ్.."

"మందు సరే గానీ.. నువ్వు రెడే కదా! తొమ్మిదింబావుకు.. రైలు లక్ష్మీపురం.. యైటింక్లైన్ నడుమకు రాగానే .. హనుమంతుని గుడి ఇవతల.. అడ్డా. మొత్తం ముప్పై ఆరు మందిమి ఈ రాత్రి.. మొత్తం ఇరవై ఆరు టన్నులు డౌన్‌లోడ్ కావాలి. మంచి క్వాలిటీ బొగ్గు వస్తోంది ఎన్.టి.పి.సి.కి ఈ రాత్రి. రైలు హనుమంతుని గుడి దాటిన అరగంటలోనే మన మనుషులు చకచకా బొగ్గునంతా గోతాల్లో కుట్టి.. అరగంటలో లారీలకెక్కిస్తారు. తెల్లారేసరికి ఆరు లారీల్లో మొత్తం ఎనిమిది పాయింట్స్ నుండి అరవై ఆరు టన్నుల బొగ్గు బాలానగర్ ఫౌండ్రీకి

చేరిపోవాలి. వాళ్ళు ఆల్రెడీ క్యాష్ అడ్వాన్స్ పే చేశారు. అరే వింటున్నావా రాజూ.."

"చెప్పు బే.. ఇంటానగాని మందు సంగతేందిరా.. దబ్బున తేరా సాలే.. స్పెషల్ పనికి స్పెషలేమీ లేదా మరి!"

"ఉన్నదున్నది.. ఈ రోజు.. క్వార్టర్‌కు బదులు ఒక్కొక్కనికి హాఫ్ తెస్తాన ఇంపీరియల్ బ్లూ, హాఫ్ చికెన్ మంచూరియా.. ఓకేనా. రెండు వందలకు బదులు.. ఈ రోజు మూడు వందలు. అన్నతోని బార్గెయిన్ చేసిన ఇవన్నీ.."

"అరే సాలె.. మంచి బామ్మర్దివిగాని.. దబ్బున రారా.. పానం గోల చేస్తాంది. దా దా."

"వస్తి.. ఐదు నిముషాలల్ల.. నా వెంట రాంరెడ్డి గాడు, బషీర్ కూడా వస్తాండ్లు. ఓ కే గదా."

"ఓకే గనీ తొందర్గ రాంర్రా."

బయో వాచ్.. లోపల అలారం మ్రోగిస్తోంది.. ట్రన్ ట్రన్ ట్రన్.. ఆగకుండా.. నిర్విరామంగా.. బిగ్గరగా.. భీకరంగా.

కళ్ళు మూసుకున్నాడు రాజు.

అతనికి చాలా అసహనంగా.. చికాగ్గా.. ఎవరిమీదనో తెలియకనే కోపంగా.. విసుగ్గా ఉంది.

ఎవరిమీద.. ఎందుకు అసహనం.

తనమీద తనకే.. తన పట్ల తనకే అసహ్యం.

ఒక్క క్షణం.. ఏ ఎత్తైన కొండపైనుండో తనొక రాయిలా దొర్లుతూ దొర్లుతూ కిందికి జారి పడ్తూ పడ్తూ.. పాతాళంలోకి.. లోయల్లోకి.. రాలిపోతూ,

అకస్మాత్తుగా రెండు చేతులు.. ఆకాశమంతా వ్యాపించి.. కూలిపోతున్న తనను అమాంతం పట్టుకుని.. గుండెలకదుముకుని.. ఒడిలోకి తీసుకుని,

'అమ్మ.. అమ్మ.. అమ్మ .. రమణమ్మ.. తనకు తల్లి.. టీచర్.. గురువు.. దైవం.. అమ్మ.'

"రాజూ.. ఒక్కసారి నా కళ్ళలోకి చూడరా.. నా తండ్రీ.. నాన్నా.. ఇటు.. నా వైపు.. నా కళ్ళలోకి.."

ఉహూ.. చూడలేకపోతున్నాడు తను.. అమ్మ కళ్ళలోకి సూటిగా చూడలేక,

సిగ్గు.. సిగ్గు.. అమ్మ ముఖంలోకి చూడ్డానికి సిగ్గు.. కూలిపోయాడు తను. శిథిలమైపోయాడు తను. బలహీనతలకూ.. వ్యసనాలకూ.. దురలవాట్లకూ బలైపోయి పతనమై తలదించుకుని.. ముఖం చెల్లని ఆత్మద్రోహ న్యూనతతో ఎప్పుడో చచ్చిపోయాడు తను.

కాని.. ఎందుకు.. ఎందుకిలా.. జరిగింది?

నాన్న జ్ఞాపకమొచ్చాడు రాజుకు అకస్మాత్తుగా.

నరేందర్.. ఓవర్ మ్యాన్.. సర్దార్.. బొగ్గుమనిషి.. చిన్నప్పటినుంచీ చూస్తున్నాడు నాన్నను.. మొత్తం బొగ్గే. మనిషి నల్లగా.. మనసు కూడా నల్లగానే.. ఎప్పుడూ మనిషి దగ్గర సారా వాసన.. ఆయన శరీరంలో రక్తముంటదా.. సారానే ఉంటదా అనిపించేది. బొగ్గుబాయిలోకి దిగితే మాత్రం మనిషి పులి.. గడ్డపార అందుకున్నడంటే బొగ్గు వాల్స్ బలబలా కూలి.. టన్నులకు టన్నులు టబ్బుల్లోకి చేరి.. రికార్డ్ ప్రొడక్షన్.. నరేందర్ ట్రూప్ అంటే ఒక స్పెషల్ గుర్తింపు.

కాని ఏమి జరిగేదో.. తెలియదు.. ప్రతి రాత్రీ అమ్మ రమణమ్మకూ, నాన్న నరేందర్‌కూ.. గొడవ.. కొట్లాట.. తీవ్రమైన తిట్లు.. ఒకరినొకరు అవమానించు కోవడాలు. కోపంతో ఊగిపోతూ నాన్న అప్పుడప్పుడు అమ్మను కొట్టడాలు.. ఆమె నిశ్శబ్దంగానే ఆ హింసను భరిస్తూ.. ఒక్కోసారి రాత్రంతా ఏడ్వడాలు.

తర్వాత్తర్వాత అర్థమైంది తనకు.. అమ్మా నాన్న మధ్య ఉన్నవి వాళ్ళ వాళ్ళ వ్యక్తిత్వాల వైరుధ్యాలని.

అమ్మది సాత్విక శాంతతత్వం.. ఎప్పుడూ ఏదో ఒక పుస్తకాన్ని చదువుతూనే కనిపిస్తుందామె ఇప్పటికీ. పుస్తకాలవల్ల మనిషికి జ్ఞానం.. ధైర్యం వస్తుందని చెప్పేది తనకు. దాంతో కొన్నాళ్ళు పిచ్చిగా తనుకూడా అనేక పుస్తకాలను లైబ్రరీ నుండి తెచ్చుకుని రాత్రింబవళ్లు చదివేవాడు.

అమ్మ తనను బడికి తీసుకుపోతూ.. తను ప్రైవేట్‌గా చదువుతూ.. క్వాలిఫికేషన్‌ను పెంచుకుంటూ.. బి.ఎ.. తర్వాత ఎం.ఎ..ఆ తర్వాత బి.ఎడ్.

ఒకనాటి రాత్రి షిఫ్ట్‌లో ఆరవ ఇంక్లైన్‌లో డ్యూటీ చేస్తూండగా బొగ్గు గని రూఫ్ ఫాల్ పైకప్పు కూలిపడి.. ముగ్గురు సజీవ సమాధి.. మరో నలుగురు తీవ్రంగా గాయపడి బతికి బయటపడుట. సమాధైన వాళ్ళలో నరేందర్.. నాన్న.

తాగుబోతు నరేందర్.. అస్తమయం.. మందమర్రిలో కోల్ కట్టర్స్ భాషలో అదీ జరిగింది.

ఈ బొగ్గు మనుషుల సంస్కృతి ఏమిటంటే.. దుఃఖమొచ్చినా.. సంతోషమైనా తాగుడే తాగుడు.. జల్సాలే జల్సాలు.

అమ్మకు రెండు ఉద్యోగాలొచ్చినై.. ఒకటి కంపాషనేట్ నియామకం.. సింగరేణి పాఠశాలలో టీచర్‌గా. రెండవది.. డిఎస్సీ పరీక్ష రాసి స్వయంప్రతిభతో సంపాదించుకున్న ప్రభుత్వ టీచర్ ఉద్యోగం.

అమ్మ తన వ్యక్తిత్వ పరిరక్షణ తత్వంతో ప్రభుత్వ టీచర్‌గానే ఉద్యోగంలో చేరింది.

ఇక తర్వాత బెల్లంపల్లికి వలస.

అప్పుడప్పుడే హైస్కూల్‌లోకి అడుగుపెడ్తూ.. తను.

కొత్త స్నేహాలు.. కొత్త ముఖాలు.. కొత్త ఊరు.. కొత్తగా శరీరంలో విజృంభిస్తున్న మార్పు.. ఎదుగుదల.

ఈ కోల్ బెల్ట్ ఏరియాలో ఒక రకమైన భిన్నమైన జీవన విధానం.. కల్చర్.. ప్రవర్తన.. విచ్చలవిడితనం.. దూకుడు.. సకల బలహీనతలతో కూడిన జీవితాన్ని స్వీకరించే తెగింపు ఉంటాయి.

అందరిలోనూ ఒక 'బలాదూర్' తత్వం.

ఆ తత్వమే మెల్లమెల్లగా బడికని వెళ్ళి.. మధ్యలో తప్పించి.. ఒక గ్రూప్‌గా రైలు పట్టాల వెంటపడి.. ఎటో తెలియదు.. రైలు.. మాల్ గాడీల్లో దొంగతనాలు.. ధాన్యాన్నమ్మి.. పైసలతో సినిమాలు.. షికార్లు.. చేపలు పట్టడానికి చెరువుల వెంట.. సిగరెట్లు తాగడాలు.. డబ్బు లేకుంటే చిన్న చిన్న దొంగతనాలు.. నాల్గు రూపాయలు దొరికిన రోజు.. ఏ బార్‌లోనో వెనుక రహస్యంగా కూర్చుని తాగడాలు.

తాగడమనేది.. ఎండుగడ్డి వాముకు నిప్పు అంటుకున్నట్టుంటది. బు ర్ ర్ ర్ మని మంట ఎగిసిందంటే.. క్షణాల్లో అంతా బూడిద. ఏమీ మిగలదు.

బాల్యంలో అలవాటైన తాగుడు.. ఇక ఎన్నడూ తెల్లారని చీకటి వంటిది.

తొమ్మిదవ తరగతి నుండి పదిలోకి అడుగు పెడ్తున్న సంధి సమయం.. వేసవికాలంలో.. పరిచయమైంది.. అప్పుడే కొత్తగా కొత్తగూడెం నుండి తన తండ్రి

ట్రాన్స్‌ఫర్‌పై వస్తే చేరిన అమ్మాయి జూలీ. మొట్టమొదటినాడు చూచినప్పుడు.. ఒక దిగ్భ్రాంతి.. షాక్.. స్టన్నింగ్ బ్యూటీ..ఆ అనుభూతి ఏమిటో అర్థంకాదు.. కాని ఇరవై నాల్గు గంటలూ ఆమెనే చూస్తూ కూర్చోవాలని పిచ్చి.. మైకం.. మత్తు.. చూస్తూంటే ఒళ్ళంతా తిమ్మిరి.. సలపరం. ఏదో ఒక నెపంతో ఊర్కే ఆమెతో మాట్లాడాలని తహతహ.. అదీగాక.. చిత్రంగా.. వాళ్ళకు క్వార్టర్ తమకు రెండిండ్ల అవతలనే అలాట్ కావడం.. ఇరవై నాలుగ్గంటలూ జూలీతో గడిపే అవకాశం.. తనుకూడా.. ఫరవాలేదు.. చూడ్డానికి బాగానే ఉంటాడు.

ఇక.. లోపల ఏదో కాగితాల మంట అంటుకుని ఎగిసెగిసి పడ్తున్నట్టు.. తగలబడిపోయేది శరీరం.. రాత్రింబవళ్ళు. అప్పుడడిగాడు తను తనకన్నా పెద్దవాడైన తన క్లాస్‌మేట్ శంకరిగాన్ని.. 'ఏమిరా ఇది' అని.

వాడన్నాడు.. 'నువ్వు ఆ జూలీ అనే పోరిని ప్రేమిస్తున్నావని అర్థం..' నవ్వు.. తొండ నవ్వినట్టు.. వికారంగా.

ఓహో.. ఇది ప్రేమా? అనే కౌమార స్పృహ.

ఇక జూలీ వెంట తనొక పిచ్చికుక్క.. ఎక్కడికి వెళ్తే అక్కడికి ఆమె వెంటే.. బాడీగార్డ్, షాడో.

గర్వంగా ఉండేది జూలీకి తన అందానికి బానిసలై మగపోరగాండ్లు వెంట పిచ్చోళ్ళై తిరగడం. చూపుల్లో.. 'సీ..హౌ దీజ్ మ్యాడ్.. మగాళ్ళు' అన్న ధీమా కనిపించేది.

తనకు ఎందుకో గాని ఆమెకు దగ్గరయ్యే అవకాశం కల్పించి.. మత్తెక్కించేది.. మా టి వి 'డాన్స్ బేబీ డాన్స్'లో.. 'ఆట' వంటి వెకిలి డాన్స్ పోటీల్లో పాల్గొని ప్రేక్షకుల్ని పిచ్చోళ్లను చేసేది. 'సీ హౌ సెక్సీ అయాం' అనేది వంకర్లు తిరిగిపోతూ. ఆ పోటీల్లో పాల్గొనేందుకు హైదరాబాద్ ఆమె వెళ్తూంటే.. తనూ.. ఇంకో ఇద్దరు ఫ్రెండ్స్.. ఆమె వెంటనే .. అంగరక్షకుల్లా.

అలా మొదలైన పిచ్చి.. ముదిరి ముదిరి.. వెంట చిత్తకార్తె కుక్కలా ఇంటర్ హెచ్ ఇ సి ఫైనల్ ఫెయిలయ్యేదాక తిరిగి తిరిగి.. తర్వాత జూలీ అన్నాళ్ళూ తెరవెనుక ఉండి కథ నడిపించిన బెంజమిన్‌తో లేచిపొయ్యేదాకా,

ఒక.. అధ్యాయం.. ముగిసి,

నిప్పుకోడి ఇసుకలో తలదూర్చి.. ఉండీ ఉండీ.. తలెత్తేసరికి.. అంతా.. విషాదంగా.. వికారంగా.. భరించలేని బాధగా.. దుఃఖంగా,

తన పేరు అమ్మా, నాన్న పెట్టిన 'ఆనందరాజు' కాస్తా 'దుఃఖరాజు'గా మారి,

'నీయమ్మ.. తాగు.. తాగు.. దుఃఖాన్ని మరిచిపోయేందుకు ఇంకా ఇంకా తాగు.. మతితప్పి.. రోడ్ల ప్రక్కన మురిక్కాలువలో పడిపాయేదాకా తాగు.. దబ్బుల్లేకుంటే దొంగతనాలు చేసి తాగు.. దొంగతనాలు చేయడానికి ఒక గ్రూప్ కావాలి.. కదా.. అందుకు ఒక దొంగల గ్రూప్‌లో కలువు.. అట్లా విస్తరణ.. జీవిత విషాద విస్తరణ.. థూ నీయమ్మ.. జూలీ.. తప్పిపోయిన ఇంటర్.. అప్పుడప్పుడు పట్టుపడ్తే పోలీసుల సహవాసం.. లాఠీ దెబ్బలు,

జీవితంలోకి చీకటి రాలేదు.. తనే కావాలని చేజేతులా చీకట్లోకి వెళ్ళి ముఖాన్ని నలుపు ఇంక్‌తో రుద్దుకున్నాడు.. అప్పుడు.. ఆ నలుపు బొగ్గు ముఖంతో నడివీధిలో తాను నిలబడ్డప్పుడు పరిచయమైన వాడు.. దేవేశ్వర్.

దేవేశ్వర్.. ఒక బొగ్గు డాన్.. మాఫియా.

దేవేశ్వర్.. ఒక బొగ్గు డాన్.. మాఫియా.

రోజుకు దాదాపు రెండు వందల టన్నుల సింగరేణి క్వాలిటీ బొగ్గును దొంగతనం చేసి.. హైదరాబాద్.. నాగపూర్.. రంగారెడ్డి జిల్లాల్లో బాజాప్తాగా అమ్మి నెలకు ఏ రెండువందల కోట్లనో సంపాదించే డాన్ అతడు. నెలకు రెండు వందల కోట్ల అతని సంపాదనలో.. దాదాపు ఇరవై కోట్లు సింగరేణి ఆఫీసర్లకు.. ఇంకో ఇరవై కోట్లు పోలీసోల్లకు.. పది పదిహేను కోట్లు రైల్వే సిబ్బందికి, డ్రైవర్లకు.. లారీలను పట్టుకోకుండా పది కోట్లు ఆర్ టి ఎ ఆఫీసర్లకు.. దొంగ వే బిల్లులు.. మేనేజ్ చేయడానికి.. గుండాలను మేపడానికి ఇంకో పది కోట్లు.. అడ్డు తగలకుండా కిక్కురుమనకుండా అన్నీ మూసుకుని ఉండడానికి రాజకీయ నాయకులకు ఓ ఇరవై ఐదు కోట్లు.. తమవంటి అసలు దొంగ కార్యశూరులకు ఖర్చు ఓ పది కోట్లు.. అన్నీ పోను దేవేశ్వర్ నెల ఆదాయం పది కోట్లు.

ఇదంతా గత పదేళ్ళుగా జరుగుతున్న బహిరంగ రహస్యమే. కోల్ బెల్ట్ జనమందరికీ సుపరిచితమైన బిజినెస్సే.

ప్రజాస్వామ్య దేశాల్లో చాలా బహిరంగంగానే జరుగుతున్న అకృత్యాలు కోకొల్లలు.. ఎన్నో.

వర్షం ఇంకా జోరుగా కురుస్తూనే ఉంది.

బయట ఐదారు మోటార్ సైకిళ్ళు ఆగిన చప్పుడు.. మనుషులు గుంపులుగా దిగి.. హడావిడిగా వస్తున్న అలికిడి.. చుట్టూ చీకటి.. చినుకుల లయాత్మక ధ్వని రేకులపై. బయట చెట్టు దగ్గర పచ్చగా బలహీనమైన లైట్ వెలుగు.

రఫీక్.. సారయ్య.. దుర్గారావ్.. మస్తాన్.. అబ్రహం.. ఇంకెవరెవరో.. మొత్తం దాదాపు ఎనిమిది మంది.. ఒళ్లంతా తడిచి.. నెత్తులపైనుండి నీళ్ళు కారుతూ,

"అరేయ్.. రాజూ.. హర్రీ.. టైమైతాంది.. అరగంటలో అక్కడుండాలె. దబ్బ దబ్బ కానీయుండ్లి.. ఊ.. పట్టు.."

చేతిలోని ప్లాస్టిక్ సంచీనుండి.. ఎదురుగా ఉన్న పాత రేకు టేబుల్పై.. ఇంపీరియల్ బ్లూ.. హాఫ్ సీసాలు.. చికెన్ మంచూరియా పొట్లాలు.. ప్లాస్టిక్ వాటర్ పొట్లాలు.. పరిచి "ఊ..కానీయుండ్లి" అని ఫర్ ర్ ర్ న ఒక సీసా మూతిని విప్పి.. డిస్పోసబుల్ గ్లాస్లోకి వంచి.. పళ్ళతో నీటి సంచి మూతిని కొరికి.. వంచి,

అమృతతుల్యమైన మనిషి రక్తం మద్యాన్ని విషంలా స్వీకరించి.. తనలో లీనం చేసుకుంటూ.. మత్తును మహత్తరమైన మెదడులోకి చిమ్ముతూ,

ఒక ఇరవై నిముషాల్లో.. మనుషులు క్రమంగా మృగాలుగా పరివర్తన చెందుతూండగా వచ్చాయి ఐదారు ఆటోలు.. సెవన్ సీటర్లు.

గబగబా మూతులు తుడుచుకుంటూ.. బిలబిలా ఆటోల్లో ఎక్కి,

"అరే రాజూ.. ఈ రోజు దబుల్ ధమాకారా. ఈ వన్ సిక్స్టీ బండి పోయిన తర్వాత మరో గంటకే ఇంకో బండిని 16 రేక్స్తో రిలీజ్ చేస్తాండ్లు ఎన్ టి పి సి కి.. స్పెషల్ కోల్ అది. ఎక్కువ మొత్తంలో తోడాలె. మనిషికి ఐదు వందలు.. ఇంకో హాఫ్ బాటిల్ బోనస్.. ఓకే.." అన్నాడు రఫీక్ అరుస్తున్నట్టు బిగ్గరగా.. అందరికీ వినబడేట్టు.

"వావ్.. దబల్ ధమాకా.. సాలే.. పా"

ఆటోల దండు కదిలింది.

రఫీక్ వెంటనే పరిస్థితులను దేవేశ్వర్‌కు సెల్‌ఫోన్‌లో చెప్పాడు.. చిన్న గొంతుతో.. "అన్నా..అన్నా" అని.

పది నిముషాల్లో.. అందరూ.. యైటీ ఇంక్లైన్ కాలనీ.. లక్ష్మీపూర్ మధ్య.. హనుమంతుని గుట్ట దగ్గర.. వర్షంలో గుంపుగా నిలబడి.,

ప్లానింగ్.. రఫీక్ చెబుతున్నాడు.. "అరే రాజు నువ్వూ.. నీ వెంట వెంకట్‌తోపాటు ఇంకా ఎనిమిది మంది.. మర్రిచెట్టు కొమ్మలపైనుండి ఎనిమిది డబ్బాల మీదికి దూకుతరు.. ఇవ్వాళ డ్రైవర్ సాలమన్ ఉన్నాడు. చెప్పిన. స్పీడ్ పదే ఉంటది.. రేక్ లోడిం దగ్గర కూడా మేనేజ్ చేసిన. లోడ్‌లో పెద్ద పెద్ద బొగ్గు పెళ్లలే ఉంటై. దబ్బ దబ్బ పెద్ద పెద్ద పెళ్లలను ఏరి.. ఎడ్జ్ మీద పెట్టి.. బుర్రి వాగు దగ్గరికి రాంగనే.. ఎర్కే గద.. సప్ప సప్ప పెళ్ళలను బైటికి నూకెయ్యాలె. అక్కడ మనోళ్ళు ఇరవై రెండు మందున్నరు. అరగంటల బొగ్గునంతా గోతాలల్ల నింపి కుడ్తరు.. సమజైందా.. ఇగోండ్లి మనిషికి మూడు వందలు.. ఈ పనై పోంగనే తొమ్మిదిన్నరకు మళ్ళచ్చి మనిషికి ఐదు వందలిస్త.. సెకండ్ ట్రైన్ కు.. ఓ కే నా."

"ఓ కే.." మనుషులు మరుక్షణం మాయమయ్యారు.. అందరూ సైనికుల్లా క్రమశిక్షణతో.

దొంగల్లో సైనికులకంటే ఎక్కువ క్రమశిక్షణ ఉంటుంది. నిబద్ధత ఉంటుంది. నిజాయితీ ఉంటుంది.. కట్టు ఉంటుంది.

చూస్తూండగానే.. ముఖంపై ఫ్లడ్ లైట్‌ను ధరించి రొప్పుతూ.. మెల్లగా.. గర్భిణీ స్త్రీలా వస్తూ కనబడింది.. బొగ్గు బండి.. వన్ సిక్స్టీ.

మర్రిచెట్టు.. లోడెడ్.. ఎనిమిది మందితో. చెట్టు దగ్గరికి రాగానే డ్రైవర్ సాలమన్ ప్లాన్ ప్రకారం రైలు స్పీడ్‌ను ఇంకా తగ్గించగానే.. దబదబా అందరూ డబ్బాలపైకి దూకి,

దోపిడి.. సామూహిక దోపిడి.. పెద్ద పెద్ద బొగ్గు పెళ్లలు.. పిడుగుల్లా పడిపోతున్నాయి మహోధృతంగా ట్రాక్ ప్రక్కన.

వర్షం కురుస్తూనే ఉంది.. ఎడతెగకుండా.

మొత్తం పదిహేను నిముషాలు.. అంతే.. ఇరవై ఐదు టన్నుల బొగ్గు పడిపోయింది బయట.

ఈ లోగా.. ఎక్కడినుండో.. విజిల్స్.. కేకలు.. ఈలలు.. టార్చి లైట్లతో.. గుంపులు గుంపులుగా వెలుగులు.. రైలు వేగాన్ని పుంజుకుంది చటుక్కున. వ్యాగన్లపైనున్నవాళ్ళు చకచకా దిగి పారిపోబోయి.. వర్షంలో జారుతూ.. పట్టు తప్పుతూ.

పోలీసులా.. అన్ని ఏర్పాట్లూ చేశారుగదా.. మరి?

రాజు.. వేగం అందుకున్న వ్యాగన్ మూలపైనుండి.. చటుక్కున కిందకు దూకి.. కింది కంకర రాళ్లపైబడి.. కాళ్ళు రక్కుకుపోయి.. మోకాళ్ళు చితికినట్లై,

ఒకటే పరుగు.. పరుగు.. చీకట్లోకి.

చూస్తూండగానే.. రైలు వేగాన్నందుకుని.. దూరంగా చీకట్లోకి మాయమై,

మళ్ళీ అంతా మామూలే.. చిక్కని చీకటి.. చిక్కగా వాన.. గడ్డకట్టిన నిశ్శబ్దం.

పరుగు పరుగులతో.. అందరూ.. ఎనిమిది మంది.. పాడుబడ్డ గుడి దగ్గర కలుసుకుని,

రఫీక్ వచ్చాడు.. ఎక్కడినుండో.. చటుక్కున. "అరే భాయ్.. వర్రీ కావద్దు.. ఒక ట్రయల్ వేశారు విజిలెన్స్‌వాళ్ళు.. లాగ్‌బుక్‌లో రాసుకుంటారు వాళ్ళంతే.. రైడింగ్ మేడ్.. అని."

"హమ్మయ్య..భయపెట్టిండ్లు గద బే.. సాలె" నవ్వులు.. పకపకా.

రాజు.. రేకుల షెడ్‌లోకి వెళ్ళి గుడ్డి వెలుతురులో పగిలిన మోకాళ్ల దిక్కు చూచుకున్నాడు.. రక్తం కారుతోంది.. ఎర్రగా.

ఎందుకో రాజుకు.. తల్లి రమణమ్మ జ్ఞాపకమొచ్చింది. ముఖం దీనంగా.. అలసటగా.. దైన్యంతో.. చేతులు చాచి పిలుస్తున్నట్టు,

ఎల్ కే జిలో తనను బడికి తీసుకుపోతూ అమ్మ .. ఒక రోజు.. అకస్మాత్తుగా వర్షం కురుస్తే.. తను మాత్రం వానలో తడిచి ముద్దైపోతూ.. గొడుగును.. తన నెత్తిపై పట్టి.. అమ్మ.. అమ్మ.

ఎందుకురా రాజూ.. చక్కగా చదువుకుని.. వృద్ధిలోకొచ్చి.. బాగుపడక.. ఈ చెడు తిరుగుళ్లు.. తాగుడు.

తాగుడు..వంశపారంపర్యంగా.. జీన్స్ ద్వారా సంక్రమిస్తుందా?.. చ్చ్.

కళ్ళు మూసుకున్న రాజుకు.. హాఫ్ తాగిన మెదడులోకి అమ్మ లీలగా..

మాయగా.. ఒక వీడియో చిత్రంలా.. కనబడ్తూ,

రజియా జ్ఞాపకమొచ్చింది.

రఫీక్ గాని చెల్లెలు.. "ప్యార్ హై ముఝే తేరేసే" అంటుంది.. అని ఒక రోజు తన గదికి పిలుచుకుని.. కౌగలించుకుని.. ముద్దెట్టుకుని.. పైపైబడి,

స్త్రీలు.. చిన్నప్పుడే ప్రవేశించిన.. జూలీ.. నిరంతరమై ప్రాధేయపడ్డ అమ్మ.. పైకి నిప్పు వరదలా ఎగబ్రాకే రజియా.. స్త్రీలు.

కళ్ళు మూసుకుంటే.. ఎప్పుడు నిద్ర పట్టిందో..

రఫీక్ వచ్చి తట్టి లేపుతూ.. కళ్ళు తెరవగానే.. ఒక ఐదు వందల రూపాయల నోటునిచ్చి.. మరో హాఫ్ బాటిల్ విస్కీ, "కమాన్.. కమాన్.. రైలొస్తాందీ.. పా పా" అని బలవంతంగా ఆటోలోకెక్కించి.. పరుగు.. పరుగు.. చీకట్లో.. వర్షంలో.

ఐపోయింది.. అమ్ముడుపోయిండు తను.. తప్పించుకోవడం కష్టం.

"అమ్మా.. వద్దు.. వద్దు నాకీ జీవితం.. ఈ తాగుడు.. ఈ బతుకు.. ఈ బానిసతనం.. ఈ దిక్కుమాలిన బికారి జీవితం.. వస్తున్నానమ్మ .. తెల్లవారనీ ఈ రాత్రి.. నీ ఒడిలోకొస్తానమ్మా.."

వర్షం ఆగదు ఒక్క క్షణమైనా.. ఒకటే కుండపోత.

దూరంగా రైలు.. తీక్షణమైన ఫ్లడ్ లైట్ కాంతితో.. మెల్లగా రొప్పుతూ.

డబుల్ ధమాకా.. ఐదు వందల కూలీ.. హాఫ్ బాటిల్ నజ్రానా.. థూ నీయమ్మ..

తప్పదు.. ఉరికురికి.. మర్రిచెట్టెక్కి.. కోతిలా కొమ్మలపైకి ఎగబ్రాకుతూ,

వస్తోంది రైలు.. దూకాలి.. దూకాలిక.. క్షణకాలంలో.

ఎందుకో.. మెల్లగా పది కిలోమీటర్ల వేగంతో వస్తున్న బండి.. సడెన్‌గా వేగం పెంచుకుని.. రయ్‌మని,

రప్పున దూకాడు రాజు వ్యాగన్ పైకి. కాని వేగం.. దూకే స్పీడ్ మ్యాచ్ కాలేదు.. వ్యాగన్ మధ్యలోకి చేరవలసిన వాడు వ్యాగన్ అంచుపై బడి.. కమ్మీకి ఫడేల్మని కొట్టుకుని.. ఒక బుల్లెట్ షాట్ తాకినట్టయి, ధబేల్మని కిందపడి.. జారుతూ.. క్షణకాలంలో పట్టాలమీదికొచ్చి.. ఇరుక్కుపోయి.. లిప్తకాలంలో.. పైనుండి.. వేగాన్నందుకున్న రైలు చక్రాలు దడదడా..,

ఎర్రగా రక్తం.. ఛిద్రమై నుగ్గు నుగ్గౌతున్న శరీరం.. ముక్కలు ముక్కలై విడివడిపోతున్న అవయవాలు.. చుట్టూ చీకట్లో ఎవరికీ కనిపించని రక్తపు మడుగు.

గాలిలో కలిసిపోయిన "అమ్మామ్మా..." అన్న గావుకేక.

తర్వాత అంతా నిశ్శబ్దం.

మెల్లగా.. దూరమై పోతూ.. గాలిలో కలిసిపోయిన బొగ్గు రైలు ధ్వని.. కొద్దికొద్దిగా పల్చబడి తగ్గుతున్న వాన.. చుట్టూ చీకటి..

ఎవరు చెట్టుపైనుండి దిగి ఎటు పారిపోయారో.. ఎక్కడ దాక్కున్నారో.. ఏమై పోయారో.. రఫీక్ ఎక్కడ.. వెంకట్ ఎక్కడ.. శ్రీకాంత్ ఎక్కడ?.. బొగ్గు.. రైలు.. ఇంపీరియల్ బ్లూ.. రజియా.. జూలీ.. మాసిపోతూ మిణుక్కు మిణుక్కు మని మెరిసే నాన్న నరేందర్ జ్ఞాపకాలు.. జీవితమంతా తనను బ్రతిలాడుతూనే ఉన్న అమ్మ రమణమ్మ.. వీళ్లంతా ఎవరు.. ఎవరికెవరు?

ఆ రాత్రి.. ఆ రైలు పట్టాలపై.. ముక్కలు ముక్కలుగా.. పడిఉన్న రాజు శరీరం.. ఒక ప్రశ్న.

మనుషులు తమను తాము ఎలా ధ్వంసించుకుంటారో .. ఎలా మిణుగురు పురుగులా హననమైపోతారో.. అని ఒక ఘటన.. ఒక మరక.. చీకటి మరక.. బొగ్గు మరక.

రాజు.. అతడు.. ఒక మరక.